

# బి. వి. టప్పయ్య

మొక్కపాటి నరసింహశాస్త్రి

దేశాలకూ, గ్రామాలకూ, మనుష్యులకూ ఉన్నట్లుగానే, మనము పెట్టుకునే పేర్లకుకూడా జాతకము వ్రాయడానికేమైనా వీలున్నదేమో మాశిరోమణిని అడగాలి. అటువంటి సావకాశ మేదైనా ఉంటే, మనమనుకున్న పేరుకి జాతకచక్రము వేసిచూసి అది మనపిల్లల కచ్చివొస్తుందో రాదో తెలుసుకుని మరీ పెట్టవచ్చును. కొందరు మిత్రులు కాదన్నా నాఅభిప్రాయము మట్టుకు పేరునిపట్టి మనిషి గుణాలుకూడా ఏర్పడతవని.

వెంగళప్ప, వెంగళ్రావు అనే పేరుగలవాళ్లని ఎవరినేనా చూడండి. వాళ్లమాటలూ చేష్టలూ అన్నీ శుద్ధ అమాయకంగా ఉంటాయి. నామాట కుదాహరణం కావలిస్తే బొబ్బిలినాటకంలో వెంగళరాయడు—నాటకములో ఉన్న దాన్నిపట్టి చెపుతున్నాను సుమండీ. ఆయన ఏసందర్భంలోనైనా సవ్యమైన సమయోచితమైనమాట ఎప్పుడన్నా అన్నాడా మహానుభావుడు. లేదు. ఎందుచేత, అతనికాపేరు వాళ్లవాళ్లు పెట్టడంచేతనని నాదృఢ విశ్వాసము. తరువాత మీరేమన్నా సరే!

ఆ వెంగళప్ప శబ్దములో లోపము గ్రహించే కాబోలు మనవాళ్లు దాన్నికొంచెము మార్చి వెంకటప్ప అన్నారు. అక్షరాలంటే మార్చగలిగినారు కాని దాని జాతకమెక్కడ మార్చగలరు? అందుకనే మనం ఎరిగున్న వెంకటప్పలంతాకూడా వెంగళప్పలే. ఆపేరు గలవాళ్లలో మహానుభావులులేరనికాదు వాళ్లు అసాధారణులన్నమాట; అనగా **Exceptions** అన్నమాట. ఆపేరును క్లుప్తపరచి మేము టప్పయ్య అనేవాళ్లము.

మాటవరుసకు మా వెంకటప్పయ్యసంగతి చెపుతాను వినండి. వాడిల్లు బంగారంగాను వాడిని పుట్టినప్పటినుంచి ఎరుగుదును. ఎప్పుడూ ఏదో ఒక తెలివితక్కువ చెయ్యడమూ, చివాట్లు తినడముతోనే సరిపోతోంది వాడి బ్రతుకు నేటివరకూను. వాడు చెయ్యాలని చెయ్యడము లేదు సుమండీ. వాడికది స్వభావమైపోయింది. ఓసారి వాళ్లనాన్న, వాడిచేతికి అణా ఇచ్చి 'బజారుకు వెళ్లి, ఒక వీశెడు వంకాయలు తెచ్చిపెట్టు నాయనా, బహుశా మూడుకాన్లకు ఇస్తారు. మిగిలిన కానిపెట్టి నువ్వేమైనా కొనుక్కుందుగాని' అన్నాడు. అణాకి తక్కువకు ఇవ్వరని ఆయనకూ తెలుసును. అలా ఆశ పెడితేనేకాని వెళ్లనంటాడని ఆయన ఆఎత్తు వేశాడు. వీడేమి చేశాడనుకున్నారు, మాట్లాడకుండా ముందు కాని పెట్టి సెనగపప్పు కొనుక్కుని, మూడుకాన్లకు వంకాయలు ఇవ్వరన్నారని చక్కావచ్చాడు. అదీ వాడిపద్ధతి.

వీడి స్కూల్లో మాష్టరుకు మెల్లకన్ను, బాగ లేండి. ఒకనాడు క్లాసులో వాడి కుడిపక్కనున్న కుర్రవాడిని ఏదో ప్రశ్నవేశాడు. ఆయన తనకేసి చూచి అడిగినట్లు అనుమానపడి చటుక్కున వాడా సమాధానం

చెప్పాడు. Master వీడి కేసిచూచి 'Stand up on the bench' అన్నాడు. తన ఎడమపక్క కుర్రాడి వనుకోని 'ఒరే త్వరగా లేచి నుంచోరా!' అని వాడిని హెచ్చరించాడు. గురువుగారికి ఒళ్లు మండిపోయి 'ఏంయ్, నిన్నే నుంచోమంటూ ఉంటూ' అన్నాడు. వాడుమళ్లీ తనకుడివేపునున్న కుర్రవాడిని పిల్చి 'ఒరేయి నిన్నుట్రా, లేవరా త్వరగాను' అన్నాడు. గురువుగారు ఆగలేపోయి వీడిని రెక్కపట్టుకుని నుంచోపెట్టి తగల్నిచ్చారు. న్యాయానికి చూస్తే వాడితెలివితక్కువతప్ప ఇందులో కొంటె తనము ఏమిలేదు. మరోమాటు ఇన్స్పెక్టరుగారు వచ్చారు వాళ్లస్కూలుకి. వాళ్ల క్లాసుపరీక్ష. ఎండలు కొంచెము ముదురుతున్నాయి. ఉక్కపోస్తోంది. అందుచేత ఆయన తలగుడ్డ బల్లమీద పెట్టి కూచున్నాడు. ఆయనకు బట్టతల. Lens తో వెతికినా ఎక్కడా నెత్తిమీద ఏవిధా నలుపు కనుపించదు. ఒకపక్కనుంచి వెలుతురు బాగా పడి దాన్ని reflect చేసేటంత నున్నగా ఉన్నది. ఆయన తలగుడ్డ తీసినదిమొదలు వీడిదృష్టి అంతా ఆయన శిరస్సు మీదనే లగ్నమైఉంది. పరీక్ష జరుగుతోంది. కొంత సేపటికి ఆయన వీడిని పిల్చి, 'అబ్బాయి, వెలుతురు ప్రతి ఫలింపచేసే వస్తువేదైనా చెప్పగలవా' అన్నాడు. ఆయన వాక్యం పూర్తి కాకుండానే వాడు, చటుక్కున 'చిత్తం బట్టతలండి' అన్నాడు. ఆదెబ్బతో వీడిని అస్కూలులో నుంచి వెళ్లగొట్టినంతపని జరిగింది.

ఎప్పుడూ ఇదేధోరణి వీడిది. వీడు మరీ చిన్నప్పుడు ఇంట్లో ఇంకో తమాషా చేశాడు. ఆవూళ్లో కొత్తగా ఒక వితంతు వివాహము జరిగింది. దాన్నిగురించి, వాదోప వాదాలు, సభలు, తీర్మానాలు, బహిష్కారాలు కొన్నాళ్ల వరకూ ఊరంతా గగ్గోలెత్తిపోయింది. ఈగొడవంతా కొంత టప్పయ్యచెవినికూడా పడ్డది. వీళ్లమ్మమ్మ వీళ్లింట్లోనే ఉండేది. ఒకరోజు పొద్దున్న ఆవిడ ఎందుకో ఏక చికాకుపడుతూ, కోపంగా 'ఒకళ్లైనా పిలుస్తే పలుకుతారా; మాట వినిపించుకుంటారా ఏమన్నా నా. ఇంట్లో కూరప్ప [illegible] లేదాయె. వంటఇల్లు వల్లకాడాయిరి. తల [illegible]ను. కాస్త మంగలివెధవను పిలవడానికైనా ఎవ్వళ్లూ మాట్లాడరాయె. నేను వీధిని పడి ఎక్కడ చావను!' అని విసుక్కోడం ఆరంభించింది.

ఇదంతా మనవాడు విని, ఒక్కక్షణం serious గా ఆలోచించి, ఆవిడదగ్గరకెళ్లి, 'అమ్మమ్మా, పోనీ నన్ను పెళ్లిచేసుకోరాదూ, వెధవవాళ్లు పెళ్లి చేసుకోవచ్చునట! అలాఅయితే నేను నీకు కూరలు తెచ్చి, మంగలిని పిలిచి ఇంకా ఇలాంటిపనులన్నీ చేసిపెడుతూ ఉంటాను' అన్నాడు. వీపు బద్దలయ్యేటట్లు ఎందుకు కొట్టిందో మనవాడికి అర్థంకాలేదు. ఇంకోసారి ఏమైనదనుకున్నారు. వీళ్లింటికి వేదాంతిని ఒకావిడ వచ్చింది. ఆవిడ చాలా గొప్ప విద్యాంసురాలని, వేదాంతశాస్త్రములో నిధి అని, చాలామంది శిష్యురాండ్రు ఆవిడదగ్గర ఉన్నారని ఆడ వాళ్లలో వాదుక. ఆవిడ ఏదో మార్గవశాత్తూ వీళ్లింటికి వచ్చింది. భోజనాలయినాయి. ఇరుగుపొరుగు అమ్మ లక్కలంతా ఈవిడఖ్యాతి విని దర్శనం చేసుకుందామని వచ్చి సభ తీర్చారు అవిడేదో తత్త్వోపదేశం చేస్తోంది. వీళ్లంతా తన్మయులయి వింటోన్నారు తెలిసినా తెలియక పోయినా, ఆడవాళ్లకు ఏది తెలియదన్నా వప్పుకుంటారు కాని, వేదాంతం తెలియవంటే చచ్చినా వప్పుకోరు లెండి.

ఆవిడ వితంతువు. మనిషి బాగా పొడుగ్గా లావుగా ఉన్నది. పెదవులమీద మీసకట్టు బాగా కనిపిస్తోంది. ఆవిడ వచ్చినది మొదలు, వీడి వెధవకళ్లు ఆవిడ మీసము మీదనే వాలినాయి. ఉపన్యాసం జోరుగా ఉంది. వీడికేమీ తోచడంలేదు. నిమ్మళంగా తల్లిదగ్గర చేరి, సణగడం ఆరంభించాడు. కొంతసేపటికి ఆవిడ 'ఏమిటి నాయనా, ఒక్కముక్కైనా చెవిని పడనివ్వవు. ఏంకావాలి? అన్నది. 'అమ్మా, ఆవిడ మీసం పెంచు తుంది ఎందుకే? మన అమ్మమ్మకీ వాళ్లకీ.........' వాక్యం పూర్తికాకుండానే నోరునొక్కి తల్లి అవతలికి లాక్కుపోయింది, ఏమి లాభం? అందరికీ వినపడ్డది, సభచాలించి వెంటనే గురువుగారు సెలవుపుచ్చుకున్నారు.

చెప్పొస్తే ఇలాటివి లక్షలు మనవాడిచర్యలు. మరి కొన్ని మరోమాటు మనవిచేస్తాను.